

పగబట్టిన విధి
ఆ కుటుంబంపై విధి పగబట్టింది. అనారోగ్యంతో దంపతులు.. బుద్ధిమాంద్యంతో కుమార్తెలు తల్లడిల్లుతున్నారు.

8లో



టమాట కిలో రూ.8
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 6, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరి
సోమవారం సాయంత్రం	మంగళవారం ఉదయం
6.32	5.09

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా విన్నవించుకోవాలని సూచించారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో...

పుట్టపర్తి టౌన్: ఎస్పీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. అర్జీదారులు తమ ఆధార్‌కార్డును తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు.

అమ్మా... ఇక నేను బతకలేనమ్మా!

- బేకరీ షాపు నిర్వహకుడు ఆత్మహత్య



మృతి చెందిన జయప్రకాష్

బత్తలపల్లి: బేకరీ వ్యాపారం సరిగా జరగకపోవడంతో కుమార్తె వివాహం, కుమారుడి చదువుకు డబ్బు ఎలా సమకూర్చాలో తెలియక షాపు నిర్వాహకుడు సతమతమయ్యాడు. రోజూ ఇదే ఆలోచనలు చేసి.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కుమార్తెకు వీడియో కాల్ చేసి 'అమ్మా.. ఇక నేను బతకలేనమ్మా' అంటూ చెప్పి ఉరివేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. కేరళకు చెందిన పరంబత్ జయప్రకాష్ (55) 35 ఏళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లికి వలస వచ్చాడు. తొలుత ఓ బేకరీలో పనిచేసేవాడు. తర్వాత కదిరి రోడ్డులో సొంతంగా 'మైసూర్ బేకరీ' షాపు ఏర్పాటు చేసుకున్నాడు. ఇక్కడే లక్ష్మీకళ అనే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. వీరికి జపాన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కుమార్తె రిన్నా, బెంగళూరులో బీటెక్ ఫస్టియర్ చదువుతున్న కుమారుడు రోహన్ ఉన్నారు. అయితే కొంత కాలంగా వ్యాపారం సరిగా జరగడం లేదు. దీనికితోడు రోడ్డు విస్తరణలో భాగంగా దుకాణం తొలగిస్తారని ఆందోళనకు గురయ్యేవాడు. ఈ విషయమై భార్యతో అమ్మా(రిన్నా) వివాహం ఎలా చేయాలి, అప్పూ (రోహన్) చదువులకు డబ్బులు ఎలా సమకూర్చాలో అర్థం కాలేదని చెబుతూ మదనపడుతుండేవాడు. ఎప్పటికప్పుడు భార్య ధైర్యం చెప్తూ వస్తోంది. బెంగళూరులో తన బంధువుల ఇంట్లో జరుగుతున్న సీమంతం కార్యక్రమానికి భార్య లక్ష్మీకళ శనివారం వెళ్లింది. ఇంట్లో ఒక్కడే ఉన్న జయప్రకాష్ ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో కూతురుకు వీడియో కాల్ చేసి 'నేను చనిపోతానమ్మా.. ఇక బతకను' చెప్పి ఫోన్ పెట్టేశాడు. వెంటనే కూతురు బెంగళూరులో ఉన్న తల్లికి విషయం చెప్పింది. బత్తలపల్లిలోని ఇంటి సమీపంలో ఉన్న సాంబశివుడు(హోటల్ శివ)కు లక్ష్మీకళ ఫోన్ చేసి అప్రమత్తం చేసింది. శివ వెళ్లి చూసేసరికి జయప్రకాష్ బేకరీ షెడ్‌లో ఉరికివేలాడుతూ నిర్జీవంగా కనిపించాడు. అనంతరం కుటుంబ సభ్యులు హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఏసీబీ పేరుతో సైబర్ నేరగాళ్ల వల

- రూ.50 వేలు పోగొట్టుకున్న లైన్‌మెన్



లైన్‌మెన్ నాగరాజు

ధర్మవరం అర్బన్: విద్యుత్ శాఖ లైన్‌మెన్ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారి పేరు చెప్పి లైన్‌మెన్ నుంచి రూ.50 వేలు దండుకున్నారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం పట్టణంలోని విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఏఈ నాగభూషణంకు శనివారం అపరిచిత నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్నాడు. మీ ఆఫీస్‌లో సీనియర్ ఉద్యోగి పేరు చెప్పాలని అడిగితే లైన్‌మెన్ నాగరాజు పేరును ఏఈ చెప్పారు. వెంటనే లైన్‌మెన్‌ను కాన్ఫరెన్స్‌లోకి తీసుకున్నారు. 'మీరు చాలా అక్రమాలకు పాల్పడ్డారని మాకు ఫిర్యాదు వచ్చింది. మీపై చర్యలు తీసుకుని కేసు నమోదు చేసి, అరెస్టు చేస్తాం' అని లైన్‌మెన్‌కు చెప్పారు. ఇప్పుడు తాను ఏమి చేయాలి సార్ అని లైన్‌మెన్ అడిగితే 'మాకు రూ.5 లక్షలు ఇస్తే కేసు లేకుండా చేస్తా' అని అటువైపు వ్యక్తి లంచం అడిగాడు. తన దగ్గర అంత డబ్బు లేదని ఏఈ తెలపడంతో చివరకు రూ.3 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. వెంటనే ఫోన్‌పేలో రూ.50 వేలు వేయించుకున్నారు. ఎవరికీ చెప్పకుండా 2 గంటల వ్యవధిలోపు మిగిలిన డబ్బులు ఇవ్వాలని, లేకుంటే నీపై కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని సదరు వ్యక్తి బెదిరించారు. ఇదేదో సైబర్ నేరగాళ్ల పని అని అనుమానం రావడంతో వెంటనే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించి, ఫిర్యాదు చేశారు.

ప్యాసింజర్ రైళ్లు పట్టాలెక్కేదెప్పుడో?

తక్కువ టికెట్ ధరతోనే సురక్షితంగా గమ్యస్థానం చేర్చే ప్యాసింజర్ రైళ్లు పేద, మధ్య తరగతి ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరం. తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లాలన్నా.. ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునేందుకు తిరుపతి వరకు వెళ్లాలన్నా ఈ ప్యాసింజర్ రైళ్లు చాలా అనుకూలంగా ఉంటున్నాయి. అలాంటి రైళ్లను మహాకుంభమేళా కోసం మళ్లించారు. మహాకుంభ మేళా ముగిసి మూడు వారాలవుతున్నా ఇంతవరకూ ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించలేదు. దీంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారింది.



ముదిగుబ్బలో నిలిచిన ప్యాసింజర్ రైలు (ఫైల్)

- మహాకుంభమేళా సమయంలో ఆరు ప్యాసింజర్ రైళ్లు రద్దు
- పునరుద్ధరణపై రైల్వే శాఖ అధికారుల తాత్సారం
- ప్రయాణికులకు తప్పని అవస్థలు



ముదిగుబ్బ రైల్వే స్టేషన్ ముఖ చిత్రం

ముదిగుబ్బ: మహాకుంభ మేళా సమయంలో రద్దయిన ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణలో జాప్యం జరుగుతోంది. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడింది. ప్యాసింజర్ రైళ్ల కోసం ప్రయాణికులకు ఎదురుచూపులు తప్పడం లేదు. అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల మీదుగా గుంతకల్లు- తిరుపతి- గుంతకల్లు (రైలు నంబర్ 57403–57404), తిరుపతి -కదిరిదేవరపల్లి- తిరుపతి (57405–57406), తిరుపతి- హుబ్లీ- తిరుపతి (57401–57402) ప్యాసింజర్ రైళ్లు నడిచేవి. మహాకుంభ మేళా సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఈ రైళ్లను రెండు నెలలపాటు రద్దు చేసి.. ప్రయాగరాజ్ వైపు మళ్లించారు. మార్చి ఒకటో తేదీ నుంచి ఈ రైళ్లను పునరుద్ధరిస్తామని రైల్వే అధికారులు అప్పట్లో ప్రకటించారు. అయితే ఆ తేదీకి రైళ్లు నడపలేదు. ఏడో తేదీ నుంచి నడుస్తాయని చెప్పారు. అదీ వాయిదా పడింది. ప్యాసింజర్ రైళ్లు తిరిగి పట్టాలు ఎప్పుడు ఎక్కుతాయా అని ముదిగుబ్బ స్టేషన్ నుంచి ప్రయాణించే ఉద్యోగులు, సాధారణ, మధ్య తరగతి ప్రజలు ఎదురు చూస్తున్నారు.

తక్కువ ధరకే సౌకర్యమైన ప్రయాణం

ప్యాసింజర్ రైళ్లలో ప్రయాణించే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు రైలు టికెట్ ధర అతి తక్కువగా ఉంది. తిరుమలకు రోజూ ముదిగుబ్బ నుంచి వందలాది మంది భక్తులు వెళ్లే వారు. అనారోగ్యంతో ఉన్న వారు తిరుపతిలోని పలు ఆస్పత్రులకు చికిత్సల కోసం వెళ్తుంటారు. అంతే కాకుండా అనంతపురం, ధర్మవరం నుంచి వచ్చే ఉద్యోగులకు కూడా ఈ ప్యాసింజర్ రైళ్లు అనుకూలంగా ఉండేవి. టికెట్ ధర తక్కువగా ఉండడంతో బస్సుల్లో ఎక్కువగా ప్రయాణాలు చేసేవారు కాదు. ముదిగుబ్బ నుంచి తిరుపతికి వెళ్లాలంటే ప్యాసింజర్ రైళ్లలో టికెట్ ధర రూ.50 మాత్రమే. అదే బస్సులో ప్రయాణిస్తే రూ.300కు పైగా వెచ్చించాల్సి ఉంటుంది. బస్సులో అయితే ప్రయాణం కూడా సౌకర్యంగా ఉండదు. మధ్య తరగతి ప్రజల కోసం ప్యాసింజర్ రైలులో రెండు స్లీపర్ బోగీలు ఉంటాయి. హుబ్లీ తిరుపతి ప్యాసింజర్ రైలులో ఒక స్లీపర్ బోగీ ఉంది. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు చాలామంది వీటిలో రెండు నెలల ముందే బుక్ చేసుకొని వారు ప్రయాణాలు కొనసాగించేవారు. రెండు నెలలు దాటినా రద్దయిన ప్యాసింజర్ రైళ్లు తిరిగి నడపపోవడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు.

భారీగా తగ్గిన రైలు చార్జీలు

ముదిగుబ్బ నుంచి తిరుపతికి ప్యాసింజర్‌లో వెళ్లే రైలు టిక్కెట్ ధరలు ఈ విధంగా వున్నాయి. జనరల్ టికెట్ ముదిగుబ్బ నుంచి తిరుపతికి రూ.50 అదే విధంగా స్లీపర్ టికెట్ ధర ముదిగుబ్బ నుంచి తిరుపతికి రూ.120. గతంలో ఇదే రిజర్వేషన్ టికెట్ రూ.330 ఉండేది. అలాగే సిట్టింగ్ టికెట్ ధర ముదిగుబ్బ నుంచి తిరుపతికి రూ.65. ఇదే టికెట్ ధర గతంలో రూ.120 ఉండేది.

రైళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం



రైళ్ల రద్దు కారణంగా తిరుమలకు వెళ్లాలంటే ఎంతో ఇబ్బందిగా ఉంది. బస్సులో వెళ్లాలంటే చార్జీలు ఎక్కువ. అదే రైలు టికెట్ ధర చాలా తక్కువగా ఉంది. మాలాంటి మధ్యతరగతి ప్రజల కోసం రైళ్లు పునరుద్ధరించాలని కోరుతున్నాం.

– వెంకటరెడ్డి, ముదిగుబ్బ

30 నుంచి రైళ్ల పునరుద్ధరణ



ప్రజల సౌకర్యార్థం రైల్వే శాఖ వారు ప్యాసింజర్ రైలు టికెట్ ధరలు భారీగా తగ్గించారు. మార్చి 30 నుంచి రద్దయిన ప్యాసింజర్ రైళ్లు తిరుగుతాయి. ముదిగుబ్బ నుంచి తిరుపతికి గతంలో రూ.330 ఉన్న స్లీపర్ టికెట్ ధర ప్రస్తుతం రూ.120కి తగ్గించారు. సిట్టింగ్ టికెట్ ధర గతంలో రూ.120 ఉండగా ఇప్పుడది రూ.65కు తగ్గింది. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

నాగభూషణం
రైల్వే స్టేషన్ మాస్టర్, ముదిగుబ్బ

కొండవీడు బండి... కదలదండీ

- రైలు వేళల్లో మార్పులతో అవస్థలు

సాక్షి, పుట్టపర్తి యశవంతపుర – మచిలీపట్నం మధ్య నడిచే కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు వేళల్లో మార్పుల కారణంగా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పెనుకొండ నుంచి ధర్మవరం చేరేందుకు మధ్యలో పుట్టపర్తిలో మాత్రమే స్టాప్ ఉంటుంది. ఆ స్టేషన్ల మధ్య ప్రయాణం గంట కూడా పట్టదు. అయితే వేళల్లో మార్పులతో కొండవీడు ఎక్స్‌ప్రెస్ పెనుకొండ నుంచి ధర్మవరం చేరాలంటే మూడున్నర గంటలు పడుతోంది. కాగా ఆ సమయంలో రైలు బండి ఎక్కడ హాల్ట్ చేస్తారనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. ఒకరోజు పెనుకొండలో.. మరోసారి పుట్టపర్తిలో.. ఇంకోసారి బసంపల్లిలో గంటల తరబడి హాల్ట్ చేస్తున్నారు. దీంతో రైలు ఎక్కిన వాళ్లు.. ఇబ్బందులు పడినా.. ఎక్కాల్సిన వారు తికమక పడుతున్నారు. స్టేషన్‌కు ఎంతసేపటికి వస్తుందో.. అర్థం కాక ముందే వచ్చి.. వేచి చూసి విసిగి చెంది వెనక్కి వెళ్లి.. ప్రత్యామ్నాయం వైపు అడుగులు వేస్తున్నారు.

మూడు రోజులూ.. ముచ్చెమటలు

వారంలో మూడు (మంగళ, గురు, శనివారం) రోజుల పాటు యశవంతపుర – మచిలీపట్నం మధ్య నడిచే కొండవీడు ఎక్స్‌ప్రెస్ (17212) రైలు రెండు గంటల ముందే నడుస్తోంది. అయితే యశవంతపుర నుంచి ధర్మవరం వరకు మాత్రమే టైమింగ్ మారింది. ధర్మవరం నుంచి మచిలీపట్నం వరకు పాత టైం ప్రకారమే నడుస్తోంది. దీంతో యశవంతపురం నుంచి యలహంక, హిందూపురం, పెనుకొండ వరకు ఇబ్బంది లేదు. ఆ తర్వాత నారాయణపురం, పుట్టపర్తి, బసంపల్లి వరకు రోజుకో చోట.. గంటల తరబడి హాల్ట్ చేస్తున్నారు. దీంతో పుట్టపర్తిలో ఎక్కాల్సిన వారు అవస్థలు పడుతున్నారు.

చాలా ఇబ్బంది పడ్డాను



కొండవీడు రైలు ఇంతకు ముందు సరైన సమయానికే నడిచేది. ఉన్నఫలంగా టైమింగ్ మార్చారు. దీంతో రెండు రోజుల క్రితం పుట్టపర్తిలో గంటన్నర సేపు వేచి ఉండాల్సి వచ్చింది. ఆన్‌లైన్‌లో చూస్తే పెనుకొండకు మూడు గంటలకే చేరింది. వెంటనే 3.20 గంటలకు పుట్టపర్తి రైల్వే స్టేషన్ చేరుకున్నా. అయితే రైలు మాత్రం 4.50 గంటలకు వచ్చింది.

– బాబయ్య, ఉపాధ్యాయుడు

విద్యార్థులూ.. విజయీభవ!

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- పరీక్షలు రాయనున్న 23,730 మంది విద్యార్థులు
- సర్వం సిద్ధం చేసిన విద్యాశాఖ అధికారులు



పుట్టపర్తి: విద్యార్థుల జీవితంలో తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాసే రోజు రానే వచ్చింది. జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 104 పరీక్ష కేంద్రాల్లో 23,730 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలుంటాయి. ఇప్పటికే అన్ని కేంద్రాల్లో మౌలి వసతులు కల్పించారు. విద్యార్థులకు ఏచిన్న ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా తాగునీరు, ఫర్నీచరు, విద్యుత్ సదుపాయం అన్ని కేంద్రాల్లోనూ ఉండేలా అధికారులు దృష్టి సారించారు.

గంట ముందుగానే చేరుకోవాలి..

తొలిరోజు విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చూడాలని అధికారులు సూచిస్తున్నారు. ముందుగా వచ్చి హాల్‌టికెట్ నంబరు ఆధారంగా ఏ గది ఎక్కడుందో చూసుకోవాలని చెబుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం ఉంటుంది. హాల్‌టికెట్ చూపిస్తే చాలు పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తారు. పరీక్షల నిర్వహణ విధుల్లో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్ల నుంచి ప్రశ్నపత్రాలు తీసుకొచ్చే సమయం, వాటిని ఓపెన్ చూసి విద్యార్థులకు అందజేసే సమయంలో జాగ్రత్తగా ఉండాల్సి ఉంది. మీడియంను ఒకటికి రెండుసార్లు పరిశీలించి సంబంధిత ప్రశ్నపత్రం ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు. ఏమాత్రం తారుమారైనా విద్యార్థులు నష్టపోతారనే విషయాన్ని ఇన్విజిలేటర్లు గుర్తు పెట్టువాలని చెబుతున్నారు. పేపర్ లీక్ చేస్తే అడ్డంగా బుక్ అవుతారని, భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో కేంద్రాల్లోకి సిబ్బంది కోసం టీ, కాఫీ బయట నుంచి తీసుకురాకూడదు. పొరబాటున ఏ ఒక్క వ్యక్తి బయటకు వచ్చినా అందుకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి, అడిషనల్ డిపార్ట్‌మెంటల్ అధికారి, ఎంఈఓలను బాధ్యులను చేస్తారు.

పటిష్ట బందోబస్తు

పుట్టపర్తి టౌన్: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రత్న పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరన్నారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, సెల్‌ఫోన్ షాపులు తెరిచి ఉంచరాదని ఎస్పీ ఆదేశించారు. పరీక్ష కేంద్రం వద్ద గుంపులుగా ఉండరాదని, 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, మెడికల్ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.

కటకటాల్లోకి కీచక ప్రిన్సిపాల్



వెంకటపతి

కదిరి టౌన్: హోలీ సందర్భంగా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన అమృతవల్లి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటపతి కటకటాలపాలయ్యారు. అమ్మాయిల పట్ల ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్న తీరును కళాశాల సమీపంలోని మహిళలు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. మహిళా కానిస్టేబుల్ గౌసియా ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ సెక్షన్ 75 కింద ప్రిన్సిపాల్‌పై శనివారం కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆదివారం ప్రిన్సిపాల్ వెంకటపతిని హిందూపురం రోడ్డు కోనేరు సర్కిల్ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి, కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో అతడిని సబ్‌జైలుకు తరలించినట్లు సీఐ వి.నారాయణ రెడ్డి తెలిపారు.

అమరజీవి సేవలు చిరస్మరణీయం





పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, రత్న

ప్రశాంతి నిలయం: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టి ప్రాణాలు త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కొనియాడారు. పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలను కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జేసీ తొలుత పొట్టిశ్రీరాములు చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కృషి చేసిన పొట్టి శ్రీరాములు నేటి యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయ సారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఏఓ వెంకటనారాయణ, పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు జీవితం స్ఫూర్తిదాయకం

పుట్టపర్తి టౌన్: త్యాగమూర్తి, నిరాడంబరుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఎస్పీ రత్న పేర్కొన్నారు. ఆదివారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ మహేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

- **సుర్రుమన్న సూరీడు**

అనంతపురం అగ్రికల్చర్: 'సన్' డే చుక్కలు చూపించింది. జిల్లాపై కొన్ని రోజులుగా సూరీడు ప్రతాపం చూపిస్తున్నాడు. మూడు రోజులుగా పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటుతోంది. ఆదివారం కూడా గార్లదిన్నెలో 40.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. పామిడి, బెళుగుప్ప, పెద్దవడుగూరు, తాడిపత్రి, పుట్లూరు, యాడికి, శింగనమల తదితర మండలాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా తాడిమర్రి, చెన్నేకొత్తపల్లి, తలుపుల, ఎన్పీ కుంట, కొత్తచెరువు, పెనుకొండ, పుట్టపర్తి తదితర మండలాల్లో 39 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు నమోదయ్యాయి.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై నృసింహుడి విహారం



సూర్యప్రభ వాహనంపై దేవదేవుడు



చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు



నృసింహుని సన్నిధిలో కలెక్టర్ చేతన్

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవ రోజైన ఆదివారం శ్రీవారు పగలు సూర్య ప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహనాలపై విహరించారు. లోకంలో పుట్టడం, పెరగడం, నశించడం అనే మూడు ప్రక్రియలు కాలాధీనాలు. ఆ కాల స్వరూపుడిని తానే అంటూ చాటి చెబుతూ శ్రీవారు సూర్య, చంద్ర ప్రభలనధిష్ఠించి దర్శనమిచ్చారు. సూర్య మండల మధ్యస్థుడైన శ్రీ మహా విష్ణువుకు నారాయణుడని పేరు. పగటికి సూర్యుడు రారాజైతే, రేయికి చంద్రుడు అధిపతి. సృష్టికి ఎంతో ముఖ్యమైన ఈ రేయింబవళ్లను శ్రీమహావిష్ణువు రెండు కళ్లుగా కలిగి ఉండి వాటినే వాహనాలుగా మార్చుకొని సృష్టిలో సర్వమూ తానే అని చాటిచెబుతూ తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవ ఉభయదారులుగా అంబే శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో సోమవారం మోహినీ ఉత్సవం నిర్వహించనున్నారు.

నృసింహుని సన్నిధిలో కలెక్టర్

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని కలెక్టర్ చేతన్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కలెక్టర్‌కు ఈఓ శ్రీనివాసరెడ్డి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

రథోత్సవానికి ఏర్పాట్లు

ఈ నెల 20న నిర్వహించనున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రథానికి కప్పిన రేకులు తొలగించి అగ్నిమాపక శాఖ అధికారుల సాయంతో నీటితో శుభ్రం చేశారు. రథం లాగేందుకు మోకులు, తెడ్లు సిద్ధం చేస్తున్నారు.

క్లుప్తంగా

ఖాళీ బిందెలతో నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

సోమందేపల్లి: మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ మాజీ సర్పంచ్ కంబాలప్ప ఆధ్వర్యంలో స్థానికులు ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. గత 15 రోజులుగా ఎస్సీ, బీసీ కాలనీ వాసులకు తాగునీరు అందడం లేదన్నారు. విషయాన్ని అధికారులకు తెలిపినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని కోరారు.

సత్యసాయి సందేశం అనుసరణీయం


సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: ఆధ్యాత్మికత, సేవా మార్గం వైపు నడిపిస్తూ సత్యసాయి అందించిన సందేశం నేటి యువతకు అనుసరణీయమని సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు అన్నారు. సత్యసాయి ఆధ్యాత్మిక, సేవా తత్వాలపై యువతను చైతన్యవంతులను చేసేందుకు సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీ సత్యసాయి వాహిని సుధామృత కోర్సును పూర్తి చేసిన వారికి ఆదివారం సర్టిఫికెట్లను అందజేశారు. ఆన్‌లైన్ ద్వారా ఈ కోర్సును దేశీయంగా 750 మందికి పైగా అభ్యసించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు ఆదివారం ఉదయం యజుర్ మందిరం నుంచి ర్యాలీగా సత్యసాయి సందేశాలను ప్రదర్శిస్తూ మహాసమాధి చెంతకు చేరుకున్నారు. ఆర్.జె రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యసాయి సేవా సంస్థల ద్వారా యువతను చైతన్యవంతులను చేసేందుకు పలు కోర్సులు నిర్వహించడం జరుగుతోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'రాజా'కు ఘన వీడ్కోలు


సాహస జాగిలాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లు టౌన్: రైళ్లల్లో పేలుడు పదార్థాల గుర్తింపు, లిక్కర్ అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు విధి నిర్వహణలో సమర్థవంతమైన సేవలందించిన సాహస జాగిలం రాజా (శునకం)కు ఆర్‌పీఎఫ్ పోలీసులు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. పదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న రాజా పదవీ విరమణను స్థానిక ప్రభాత్‌నగర్‌లోని ఆర్‌పీఎఫ్ డాగ్ స్క్వాడ్ ఆఫీసులో ఘనంగా నిర్వహించారు.

పగబట్టిన విధి

రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబంపై విధి పగ బట్టింది. ఎప్పుడూ ఏదో ఒక సమస్య రూపంలో పలకరిస్తూనే ఉంది. దానికి ఎదురొడ్డి నిలబడేలోపు మరో సమస్యతో ఆ కుటుంబం తల్లడిల్లుతూనే ఉంది. బుద్ధిమాంద్యంతో జన్మించిన ఇద్దరు కుమార్తెలు ఏ పనీ చేయలేక ఇంటి పట్టునే ఉంటున్నారు. బిడ్డల భవిష్యత్తు తలుచుకుంటూ మదనపడుతున్న తల్లిని గుండె సమస్య పలకరించింది. బైపాస్ సర్జరీతో ప్రాణాలు దక్కాయి. కష్టాల సుడిగుండంలో బతుకు నావను ఒడ్డుకు చేర్చే క్రమంలో ఇంటి పెద్ద ప్రస్తుతం మంచాన పడ్డాడు. సరైన వైద్యం అందించలేక విలవిలాడుతున్న ఆ కుటుంబంపై కథనం.

– తాడిమర్రి:

- బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న ఇద్దరు కుమార్తెలు
- కుమార్తెల భవిష్యత్తుపై ఆందోళనతో తల్లికి గుండెపోటు
- బైపాస్ సర్జరీతో దక్కిన ప్రాణాలు
- ఇంతలో రెండు కిడ్నీలు చెడిపోయి మంచం పట్టిన తండ్రి
- ఆపన్నహస్తం కోసం ఎదురు చూపు


ఇంటి వద్దనే భర్తకు సపర్యలు చేస్తున్న సుభద్రమ్మ


కుమార్తెలకు జడలు వేస్తున్న దృశ్యం

తాడిమర్రి మండలం కునుకుంట్ల బీసీ కాలనీలో నివాసముంటున్న భూమె లక్ష్మయ్య, భూమె సుభద్రమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు (కవలలు) ఉన్నారు. మేనరికం కారణంగా జన్మించిన పిల్లలు బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నారు. అయినా నిరుపేద తల్లిదండ్రులు ఏమాత్రం కుంగిపోకుండా పిల్లలను అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. వయసు పెరిగినా స్నానం చేయడం, బట్టలు వేసుకోవడం, తలలు దువ్వుకోవడం రాదు. ఈ పనులన్నీ తల్లినే చేస్తోంది. పిల్లల బాగోగులు చూసుకునేందుకు ఇంటిపట్టునే ఆమె ఉండిపోవాల్సి వచ్చింది. దీంతో లక్ష్మయ్య ఒక్కడే కూలి పనులకు వెళుతూ వచ్చే అరకొర సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారు.

కుమార్తెల భవిష్యత్తుపై దిగాలుతో..

కుమార్తెలకు 45 ఏళ్ల వయసు వచ్చినా ఏ పనీ చేసుకోలేక పోతుండడం తల్లిని మరింత కుంగ దీసింది. ఇప్పటికే తనకు 62, లక్ష్మయ్యకు 65 ఏళ్లు కాగా, తాము కాలం చేస్తే కుమార్తెల భవిష్యత్తు ఏమిటనే ఆందోళన ఆమెకు కంటి మీద కునుకు దూరం చేసింది. ఈ నేపథ్యంలో 15 ఏళ్ల క్రితం సుభద్రమ్మ ఒక్కసారిగా గుండెపోటుకు గురైంది. వెంటనే బంధువులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళితే బైపాస్ సర్జరీతో ప్రాణాలు కాపాడారు. కుమార్తెల భవిష్యత్తుకు దాచిన డబ్బుతో పాటు మరి కొంత అప్పులు చేసి బైపాస్ సర్జరీకి ఖర్చు చేయాల్సి వచ్చింది.

ఆరని కంట తడి

అష్టకష్టాలు పడి ఒంటి చేత్తో కుటుంబాన్ని పోషించుకుంటున్న తరుణంలో ఇంటి పెద్ద దిక్కుగా ఉన్న లక్ష్మయ్య ఒక్కసారిగా మంచాన పడ్డాడు. తన ఆరోగ్యం క్షీణిస్తున్న విషయం తెలిసినా... కుమార్తెల భవిత కోసం పరితపిస్తూ నిర్లక్ష్యం చేసినందుకు గాను ఆయన రెండు కిడ్నీలూ పాడైపోయాయి. వారానికి మూడు సార్లు తప్పని సరిగా డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తోంది. గత ఏడాది వరకు డయాలసిస్ కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తీసుకెళ్లేవారు. ఈ ఏడాది 108 అంబులెన్స్ సేవలు కరువయ్యాయి. దీంతో వారానికి మూడు సార్లు డయాలసిస్ కోసం అనంతపురానికి ఆటోలో తీసుకెళుతున్నారు. ఒక్కసారి ఆటో ఖర్చులకు గాను రూ.1,800 ఖర్చు పెట్టాల్సి వస్తోంది. డయాలసిస్, ఇతర వైద్య ఖర్చులు, ఆటో బాడుగ తదితరాలన్నీ కలుపుకుని సుమారు రూ.30 వేల వరకు ఖర్చు అవుతోంది. ఇలాంటి తరుణంలో తమ తదనాంతరం పిల్లల బాగోగులు ఎలా? అనే ప్రశ్న దంపతులను వేధిస్తోంది. ఆపన్న హస్తం అందించి తమను ఆదుకోవాలని నిరుపేద కుటుంబం వేడుకుంటోంది.

ఎవరైనా ఆర్థిక సాయం చేయదలిస్తే..	
పేరు	భూమె సుభద్ర
బ్యాంక్	ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, గూగూడు, నార్పల మండలం
ఖాతా నంబర్	9100 697 9467
ఐఎఫ్ఎస్‌సీ కోడ్	ఏపీజీబీ0001012
సంప్రదించాల్సిన నంబర్	89781 03514
ఫోన్‌పే నంబర్	90001 86304

'నీరు'గారిన ఆశ



ఆ చెట్లు పచ్చగా కళకళలాడేవి. చూపరులకు కనువిందు చేసేవి. కానీ నేడు నిర్జీవంగా మారాయి. చిగురించే ఆశలన్నీ 'నీరు'గారిపోయాయి. నీరు తక్కువైనా, ఎక్కువైనా నష్టమే అనేందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ దృశ్యం అనంతపురం సెంట్రల్ పార్క్‌లోనిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

కంబాలరాయుడే కాటమరాయుడు


కంబాల రాయుని కొండపై ఉన్న శిద్దుల దొన


కొండపై ఉన్న శ్వేత తీర్థం



కదిరి: దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం మహా విష్ణువు వివిధ రూపాల్లో సాక్షాత్కరించారు. ఇందులో ఒకటి నారసింహుడు. ముల్లోకాలను ముప్పుతిప్పలు పెట్టిన హిరణ్య కశ్యపుడిని అంతమొందించేందుకు సగం మనిషి, సగం సింహ రూపంలో అవతరించిన నారసింహుడుని కంబాల రాయుడు అని కూడా భక్తులు పిలుస్తుంటారు. కంబం అంటే స్తంభం. స్తంభం నుంచి ఉగ్రరూపంతో భువిపైకి వచ్చిన నారసింహుడు.. హిరణ్య కశ్యపుడిని అంతమొందించిన తర్వాత గాండ్లపెంట మండలం గొడ్డువెలగల సమీపంలోని కొండపై అవతరించారని ఈ ప్రాంత ప్రజల నమ్మకం. ఇందుకు అక్కడి కొండపై స్వామి పాదాలు వెలిసినట్లు పురాణాలు సైతం చెబుతున్నాయి. ఇదే కొండపై శ్వేద తీర్థం, శిద్దుల దొన ఉన్నాయి. ఎన్ని కరువు కాటకాలొచ్చినా నీరు ఇంకి పోకుండా ఉండడం ఈ దొనల ప్రత్యేకత. ఈ ప్రాంతాన్ని ఒకప్పుడు పాలేగాళ్లు పాలించారు. వారు తమ ఇలవేల్పుగా లక్ష్మీనరసింహస్వామి కొలిచేవారు. అందుకే వీరి కుటుంబీకులు కదిరి ప్రాంతంలో ఎంతోమంది కంబన్న, కంబాలమ్మ అనే పేర్లు పెట్టుకున్నారు. ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో పాలేగాళ్ల వారసులు గొడ్డువెలగల నుంచి నృసింహాలయానికి ఆనవాయితీగా ఇప్పటికీ జ్యోతిని తీసుకొస్తుంటారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మంత్రి సవితను సన్మానిస్తున్న దృశ్యం


పురస్కార గ్రహీతలతో శిల్ప అనుపాటి, తదితరులు

- మంత్రి సవిత

పెనుకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండ మార్కెట్‌యార్డ్‌లో ఆదివారం జిల్లా రచయితల సంఘం, త్రివురా రిసార్ట్, ఎంక్యూయూఏ, ఘనగిరి లలిత కళాపరిషత్, బహుజన చైతన్య వేదిక తదితర సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సభా అధ్యక్షుడిగా జాబిలి చాంద్‌బాషా, సమన్వయకర్తగా ఉద్దండం చంద్రశేఖర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ప్రతి కుటుంబం అభ్యున్నతి వెనుక మహిళ పాత్ర ఎంతో కీలకమన్నారు. తమ పిల్లలకు ఉన్నత చదువులు చెప్పించాలన్నారు. బాల్య వివాహాలు లేకుండా చూడాలని కోరారు. పెనుకొండలో షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఎస్పీ రత్న, షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ నిర్వాహకులు శిల్ప అనుపాటి తదితరులు మాట్లాడుతూ.. విద్యతోనే మహిళల జీవితం ఉన్నతంగా ఉంటుందన్నారు. అనంతరం మంత్రికి పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురికి మహిళా శిరోమణి పురస్కారాలను మంత్రి అందజేసి సత్కరించారు. సమావేశంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, రామ్మూర్తినాయుడు, శ్రీరాంయాదవ్, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, సంస్థల నాయకులు గోపీనాథ్, ఖలీముల్లా, టిప్పు సుల్తాన్ సంస్థ ఉమర్‌ఫారూక్‌ఖాన్, పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు.

శ్రీవారిని తాకిన సూర్య కిరణాలు



ధర్మవరం అర్బన్: సూర్య పూజా మహోత్సవాల్లో భాగంగా స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలోని చెన్నకేశవస్వామి మూలవిరాట్‌ను ఆదివారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. తొలుత లక్ష్మీచెన్నకేశవస్వామి వక్షస్థలాన్ని తాకిన సూర్యకిరణాలు అనంతరం పాదాల వరకూ సాగాయి. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు.

వాహనం బోల్తా

- 18 మందికి గాయాలు, నలుగురి పరిస్థితి విషమం


పరిస్థితి విషమంగా ఉన్న వన్నూరమ్మ


తీవ్రంగా గాయపడిన వరుణ్

ఉరవకొండ: స్థానిక 42వ జాతీయ రహదారిపై చిన్నముష్టూరు వద్ద టాటా ఏస్ వాహనం బోల్తాపడిన ఘటనలో 18 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా మారింది. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం మోపిడి గ్రామానికి చెందిన రేణుక కుమార్తె మౌనిక సీమంతం కార్యక్రమానికి బొమ్మనహాళ్ మండలం హరేసముద్రం గ్రామానికి చెందిన సమీప బంధువులు 30 మంది ఆదివారం టాటా ఏస్ వాహనంలో బయలుదేరారు. చిన్నముష్టూరు వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం రెండు పల్టీలు కొట్టి బోల్తాపడింది. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో వినీత, నాగలక్ష్మి, వరుణ్, వన్నూరమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బళ్లారికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతిపై అనుమానాలు



యోజిత (ఫైల్)

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ వద్ధతిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ యోజితా సాహో (27) మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ బీకేఎస్ పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయ్‌పూర్ జిల్లా దుర్గ్ గ్రామానికి చెందిన యోజిత సాహో బుక్కరాయసముద్రంలోని తాను నివాసముంటున్న అద్దె గృహంలో శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు రాయ్‌పూర్ నుంచి ఆదివారం అనంతపురంలోని సర్వజనా స్పత్రికి చేరుకున్నారు. కుమార్తె మృతదేహాన్ని చూడగానే బోరున విలపించారు. అనంతరం ఆమె అద్దెకున్న ఇంటిని పరిశీలించారు. తమ కుమార్తె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని ఈ సందర్భంగా వారు పోలీసులకు తెలిపారు. కుమార్తె ఆత్మహత్యపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా అనంతపురం డీఎస్పీ వెంకటేశ్వర్లు, బీకేఎస్ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేశారు. మృతురాలి ఐ ఫోన్, లాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వర్సిటీ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో యోజితా మృతదేహాన్ని తీసుకుని తల్లిదండ్రులు స్వగ్రామానికి తరలివెళ్లారు.

అరటి తోట దగ్ధం

బెళుగుప్ప: అగ్ని ప్రమాదంలో అరటి తోట దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన రైతు నరసింహులు తనకున్న ఆరు ఎకరాల్లో అరటి పంట సాగు చేపట్టాడు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. ఆదివారం ఉదయం తోట వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని నిప్పు రవ్వలు ఎగిసి పడి మంటలు వ్యాపించాయి. దీంతో సుమారు 2.5 ఎకరాల్లోని డ్రిప్ పరికరాలతో పాటు అరటి చెట్లు కాలిపోయాయి. సమాచారం అందుకున్న కళ్యాణదుర్గం అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. దాదాపు రూ.6 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

ప్రైవేట్ స్కూల్ టీచర్ దుర్మరణం


మృతుడు బోయ నారాయణస్వామి

ధర్మవరం: మండలంలోని చిగిచెర్ల వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ ప్రైవేట్ స్కూల్ టీచరు దుర్మరణం పాలయ్యారు. వివరాలు... ధర్మవరంలోని మార్కెట్ వీధిలో నివాసముంటున్న బోయ నారాయణస్వామి (54) ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. వ్యక్తిగత పనిపై తన స్నేహితుడు సాంబశివుడుతో కలసి ధర్మవరం నుంచి ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై అనంతపురానికి బయలుదేరిన ఆయన... మార్గమధ్యంలో చిగిచెర్ల దాటగానే ఓబిరెడ్డి తోట మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్‌ను గమనించక వేగంగా దూసుకెళ్లారు. ఘటనలో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడింది. కల్వర్టు వద్ద లోతైన గుంతలో పడిన నారాయణస్వామి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. వాహనంపై వెనుక కూర్చొన్న సాంబశివుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. కామాంధుడి బారి నుంచి తనను తాను కాపాడుకునే క్రమంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకోగా... అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ కౌలు రైతు, జీవితంపై విరక్తితో మరో యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డారు.


మృతురాలు కవిత

- **నార్పల:** లైంగిక వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... నార్పలలోని సుల్తాన్‌పేట కాలనీకి చెందిన కవిత(26), వెంకటశివ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్న వెంకటశివ శనివారం రాత్రి గ్రామ శివారులో విడిచిన గొర్రెల వద్దకు కాపలాకు వెళ్లాడు. విషయాన్ని గుర్తించిన అదే కాలనీకి చెందిన యువకుడు బండి లక్ష్మీనారాయణ... ఇంట్లోకి చొరబడి కవితాపై అత్యాచారయత్నం చేశాడు. ఆ సమయంలో కేకలు వేస్తూ అతని బారి నుంచి బయటపడిన ఆమె... లోపలి గదిలోకి వెళ్లి తలుపునకు గడియ పెట్టుకుంది. అదే సమయంలో తలుపులు బద్ధలుగొట్టేందుకు లక్ష్మీనారాయణ ప్రయత్నించడంతో దిక్కుతోచని స్థితిలో కవిత ఉరి వేసుకుంది. ఇంతలో శబ్దాలకు చుట్టుపక్కల వారు.నిద్ర లేచి గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి లక్ష్మీనారాయణ పారిపోయాడు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించిన స్థానికులు అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కవితను గమనించి సమాచారం ఇవ్వడంతో వెంకటశివ అక్కడకు చేరుకుని బోరున విలపించాడు. రెండేళ్లుగా కవితను బండి లక్ష్మీనారాయణ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని, ఈ నేపథ్యంలోనే కవితను హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం చేశాడంటూ తల్లి నాగసుబ్బమ్మ చేసిన ఫిర్యాదు మేరకు సీఐ కౌలుట్లయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.
- **పెద్దవడుగూరు:** మండలంలోని గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన రైతు తలారి రాము(43) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్న రాము... మూడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. దిగుబడి రాక అప్పులకు వడ్డీల భారం పెరిగింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదనపడుతున్న రాము... ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపు గుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసుల దర్యాప్తు చేపట్టారు.
- **కూడేరు:** మద్యం మత్తులో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం కలగళ్లకు చెందిన అమర్‌నాథ్(28) మద్యానికి బానిసగా మారి జులాయిగా తిరిగేవాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లోకి చేరుకుని తలుపులు వేసుకుని నిద్రించాడు. ఇంటి బయట నిద్రించిన తండ్రి కొండయ్య ఆదివారం ఉదయం లేచి తలుపులు తీయాలని పిలిచినా లోపలి నుంచి ఎలాంటి స్పందన లేకుండా పోయింది. దీంతో అనుమానం వచ్చి తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్లి చూశారు. అప్పటికే ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించిన కుమారుడిని చూసి సమాచారమివ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నియామకాల్లో నిర్లక్ష్యంపై కొరడా

- ఇన్విజిలేషన్ డ్యూటీల్లో అవకతవకలపై ఆర్జేడీ చర్యలు
- ఐదుగురికి షోకాజ్ నోటీసులు
- తీవ్ర చర్చనీయాంశమైన 'సాక్షి' వరుస కథనాలు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) కొరడా ఝళిపించారు. ఐదుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇన్విజిలేషన్ డ్యూటీల కేటాయింపుల్లో గందరగోళం, అంధులు, పక్షవాత బాధితులు, దివ్యాంగ టీచర్లు, చివరకు రిటైర్డ్ అయిన వారినీ విధులకు కేటాయించిన వైనంపై 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. 'పది పరీక్షల నిర్వహణలో గందరగోళం', 'పదింతల నిర్లక్ష్యం' కథనాలు విద్యాశాఖలో ప్రకంపనలు సృష్టించాయి. సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్ అయ్యాయి. ప్రాథమిక విద్య కమిషనర్, కలెక్టర్ కూడా స్పందించారు. ఈ క్రమంలో పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ చర్యలకు ఉపక్రమించారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, డెప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, అనంతపురం ఎంఈఓ వెంకటస్వామి, సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, పరీక్షల విభాగం అసిస్టెంట్ రామాంజనేయులుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారిచ్చే వివరణను బట్టి తదుపరి చర్యలుంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రధాన కారణంగా భావిస్తున్న కీలక అధికారిపై వేటు తప్పదనే ప్రచారం సాగుతోంది.

'టిస్' ఉన్నా అలసత్వం..

టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్) ద్వారా ఇటీవల ఉపాధ్యాయుల పూర్తి వివరాలు సేకరించారు. ఏ స్కూల్‌లో ఏ టీచరు పని చేస్తున్నాడు... పేరు, వయసు, పుట్టిన రోజు, పీహెచ్ కేటగిరీ తదితర వివరాలున్నాయి. ఫిబ్రవరి 28న రిటైర్డ్ అయిన వారి వివరాలు కూడా ఇందులో అప్‌డేట్ అయ్యాయి. ఈ వివరాలన్నీ డీఈఓ కార్యాలయంలో ప్రభుత్వ పరీక్షల విభాగం పక్క గదిలోనే లభిస్తాయి. అయినా ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం చూస్తుంటే పరీక్షల నిర్వహణ విభాగం అధికారులు ఎంత నిర్లక్ష్యంగా పనిచేశారో అర్థం చేసుకోవచ్చు.

ఎంఈఓలు, హెచ్‌ఎంలకు పంపి ఉంటే...

10–15 రోజుల ముందే ఎంఈఓల ద్వారా ప్రధానోపాధ్యాయులకు జాబితాలు పంపి రిమార్కులు అడిగి ఉంటే కూడా చాలా వరకు తప్పిదాలకు అవకాశం ఉండేదికాదు. అలా చేయకుండా కేవలం పరీక్షల విభాగం ఒంటెద్దు పోకడలతో తీసుకున్న నిర్ణయాలు అనేకమంది టీచర్లను ఇక్కట్లు పాలు చేశాయి. ఈ క్రమంలోనే అంధులు, పక్షవాత బాధితులు, చంటిపిల్లల తల్లులు, బాలింతలు, దివ్యాంగ టీచర్లు, రిటైర్డ్ టీచర్లు, మెడికల్ లీవ్‌లో ఉన్న వారినీ ఇన్విజిలేటర్లుగా నియమించారు. ఇలాంటి వారే 200 మంది దాకా ఉన్నట్లు తెలిసింది. పరీక్ష కేంద్రాల చీఫ్‌లకు అందజేసి చేతులు దులుపుకోవడం వల్ల సమాచార లోపించి ఆర్డర్లు జారీ చేసి రెండు రోజులు దాటినా 40 శాతానికి మందికి పైగా ఉత్తర్వులు అందజేలేదు. ఈ విషయంపైనా ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు.